
క్లుప్తంగా

కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి



బహుమతి పొందిన కార్టూన్

గరుగుబిల్లి: ప్రముఖ హాస్యపత్రిక హాస్యానందంలో తోరహతు వెంకటరత్నం, వనజాక్షమ్మ దంపతుల స్మారక పురస్కారం - 2023 కార్టూన్ పోటీలలో మండలంలోని నాగూరుకు చెందిన పల్ల రోహిణికుమార్ 'చెట్ల వినాశం'పై వేసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి, ప్రశంసాపత్రం అందుకొన్నారు. ఈయనకు పలువురు అభినందనలు తెలిపారు.

రావాడలో ఇంటింటికి కుళాయిలు



రావాడలో బోరు పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ శశికళ

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ పంచాయతీ రావాడలో ఇంటింటికి కుళాయి ఇస్తామని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి హామీ ఇచ్చారని ఉప సర్పంచ్ కళావతి గుర్తుచేశారు. ఇచ్చిన హామీ మేరకు రూ.5 లక్షలతో బోరుతో పాటు కుళాయిలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జెడ్పీటీసీ శశికళ చేతుల మీదుగా బోరు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, గ్రామపెద్దలు బీమన మ్మదొర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయంపై ప్రతీ ఒక్కరూ దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి రైతులకు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఘన పదార్థాలతో తయారు చేసిన ఘనామృతంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ వలన భూసారం పెరగడంతో పాటు పంటల దిగుబడి బాగుంటుందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జె.సౌజన్య, డెమో సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ తదితరుల

పాలకొండ రూరల్ : భారతరత్న బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని పాలకొండ నగర పంచాయితీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం తమ కార్యాలయం వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు బత్తిన మోహనరావు, యెమ్మల సతీష్‌కుమార్, నూతలపాటి భరత్‌భూషణరాజు తదితరులు మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, స్వతంత్ర్య సమరయోధునిగా, రాజకీయ నాయకునిగా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులు టి.ఉపేంద్రకుమార్, జి.రవికుమార్, బి.విశ్వేశరరావు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం కావాలి

పాలకొండ: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. మండలంలోని సింగన్నవలస గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాల ఉపయోగపడేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. సచివాలయం ద్వారా అన్ని రకాలను సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి సోమేశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి.. భవితకు పెట్టుబడి

- ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: అమ్మ ఒడి నాల్గవ విడత నిధుల పంపిణీ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: అమ్మ ఒడి పథకం విద్యార్థుల భవితకు బంగారు బాట వేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. పాలకొండ నగర పంచాయతీలోని పెద్ద కాపువీధి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఒడి నాల్గవ విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో వీరు గురువారం పాల్గొని మాట్లాడారు. 5083 మంది తల్లుల ఖాతాల్లో ఈ ఏడాది అమ్మ ఒడి పథకం ద్వారా నిధులు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, ఎంపీపీ బొమ్మాళి భాను, మండల పార్టీ అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాశరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్‌కుమార్, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి, హెచ్.ఎం సోమేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమ్మ ఒడితో ఆనందం

వీరఘట్టం: విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకంతో విద్యార్థుల్లో ఆనందాన్ని నింపారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అమ్మ ఒడి నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గురువారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఒడితో కొన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని అన్నారు. విద్యార్థుల చదువులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యా సంవత్సరం ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశామన్నారు. ఇది ఒక మహత్తర కార్యక్రమం అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలసి విద్యార్థులకు అమ్మ ఒడి చెక్కును అందజేశారు. మండలంలో ఈ ఏడాది 5311 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమ చేయడం జరిగిందని ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పాలకొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

గడప గడపకు ప్రభుత్వ లబ్ధి



బెల్లిడిలో మహిళకు బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలోని కొల్లిగూడ, దాదుపురం, విశ్వనాథపురం, బెల్లిడి, బొడ్లగూడ, దొరజమ్ము, చింతలపాడు, సుందరయ్య కాలనీ, మేదరగండ, బుడ్డెమ్మఖర్జ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆమె వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, మండల స్థాయి అధికారులతో ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తూ బ్రోచర్లను అందజేశారు. గ్రామస్తులు తెలియజేసిన సమస్యలపై స్పందిస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ఇంటి వద్దనే అందిస్తున్నారన్నారు.

కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఎంపీపీలు కుంబురుక దీనమయ్య, శెట్టి పద్మావతి, మండంగి రాధిక, గొర్లె సుజాత, వైస్ ఎంపీపీలు నిమ్మక లక్ష్మణరావు, నిమ్మక శేఖర్, ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిడుగులకు గిరాకీ

భామిని: వర్షాకాలం వచ్చింది. వ్యవసాయ పనులు ప్రారంభమై ముమ్మరమయ్యాయి. రైతు శిరస్త్రానంగా పిలిచే గిడుగుల అవసరం పెరిగింది. దీంతో తాటాకు గిడుగుల కొనుగోలుకు రైతు కుటుంబాలు ఆసక్తి చూపుతున్నాయి. భామిని మండలం చిన్నదిమిలికి చెందిన గీతకార్మికులు తయారు చేసిన గిడుగులకు భలే గిరాకీ పెరిగింది. కురుస్తున్న వర్షాలకు అనుగుణంగా గీత కార్మికులు గిడుగులను తయారు చేసి గ్రామాల్లో అమ్మకం చేస్తున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు కొనుగోలు చేస్తున్నారు.



తాటాకు గిడుగులు కొనుగోలు చేస్తున్న గ్రామీణులు

జగనన్న సురక్ష ఓ నూతన అధ్యాయం : పీడీ

వీరఘట్టం: రాష్ట్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ఓ నూతన అధ్యాయమని, ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. తలవరం, హుస్సేనుపురం సచివాలయాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇంతవరకు పరిష్కారం కాని సమస్యలకు జగనన్న సురక్ష పథకం ఓ చక్కని అవకాశమన్నారు. అనంతరం 151 మందికి వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో తహసీల్దార్ చందక సత్యన్నారాయణ, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, ఈఓపీఆర్‌డీ వి.రామచంద్రరావు, సర్పంచ్‌లు శిష్టు మధుసూదనరావు, టొంపల లక్ష్మి, ఆర్.ఐ మారుతీరావు పాల్గొన్నారు.



హుస్సేనుపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డ్వామా పీడీ కిరణ్‌కుమార్

ఐటీడీఏ ఎదుట గిరిజనుల ఆందోళన

సీతంపేట: ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న భూములు తమకు అప్పగించాలంటూ బిల్లమడ పరిసర ప్రాంతాల గిరిజనులు గురువారం సాయంత్రం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. అధిక సంఖ్యలో గిరిజనులు ఐటీడీఏ వద్దకు చేరుకున్నారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం గిరిజనులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారిని కలిశారు. ఆ భూములపై ఎటువంటి ఆధారాలు ఉన్నా తీసుకురావాలన్నారు. దీనిపై గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని తహసీల్దార్ నరసింహమూర్తికి సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశాలు



ఇంటర్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సత్యవతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాలలో (పీటీజీ) ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల నిమిత్తం గురువారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కళాశాలలో ఉన్న ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో గతంలో కేటాయించిన సీట్లు భర్తీ అయినప్పటికీ, విద్యార్థుల డిమాండ్ల మేరకు ఒక్కో గ్రూపుకు అదనంగా 10 సీట్లు చొప్పున్న భర్తీ చేపట్టేందుకు ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని, 32 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వగా 30 మందిని ఆయా గ్రూపులకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ఎ.సత్యవతి తెలిపారు. కళాశాల సిబ్బంది ఉన్నారు.

వాహన తనిఖీలు



చిట్టపులివలస జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

వీరఘట్టం: డ్రైవింగ్ లైసెన్సులు లేని తమ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని ఎస్.ఐ ఎం.వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. చిట్టపులివలస జంక్షన్, వీరఘట్టం హాస్పటల్ జంక్షన్ వద్ద గురువారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేసారు. ఎక్కువ మంది యువత డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. అటువంటి వారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

10, 11 తేదీల్లో అంగన్‌వాడీల ధర్నా

కురుపాం: అంగన్‌వాడీల కోర్కెల దినాల సందర్భంగా ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేయనున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు తెలిపారు. ధర్నాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు సరళకుమారి ఆధ్వర్యంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు డబ్బులు కేటాయింపు పెంచాలని, అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేయాలని కోరారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు తప్పనిసరి

గరుగుబిల్లి: పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్‌లు వేయించాలని పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. బి.గణపతిరావు అన్నారు. జునోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా పశు వైద్యశాలలో 20 పెంపుడు కుక్కలకు ఆయన గురువారం వ్యాక్సిన్‌లు వేశారు. వ్యాక్సిన్‌లు వేయడం వల్ల వ్యాధులు సక్రమించకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్ కుమార్, శ్రీరాములునాయుడు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ అవసరం

పాలకొండ రూరల్: పెంపుడు జంతువుల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, జంతువుల యజమానులు శ్రద్ధ వహించాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ప్రభామాణిక్యరావు అన్నారు. అంతర్జాతీయ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొండ పశువుల ఆస్పత్రిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి బచ్చు సిద్దార్థ్ నేతృత్వంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం పశు వైద్యశాలలో జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఏఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పశువైద్య సిబ్బంది ఎ.బాబ్జి, క్రాంతికుమారి, పవన్‌కుమార్ గురువారం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు ప్రత్యేక వ్యాక్సిన్లను వేస్తున్నట్లు చెప్పారు.



గరుగుబిల్లి: కుక్కలకు వ్యాక్సిన్‌లు వేస్తున్న సహాయ సంచాలకులు డా.బి.గణపతిరావు



పాలకొండ రూరల్: పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

పాఠశాల తనిఖీ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ఎంపీపీ పాఠశాలను ఎంఈవో - 1 ఎస్.నాగభూషణరావు, ఎంఈవో - 2 ఎం.శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లలో ఉన్న హాజరు, యాప్‌లలో నమోదు చేసిన హాజరును పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల రోజువారీ హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేవీకే కిట్ల పంపిణీ త్వరితగతిన చేయాలన్నారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగయ్య ఉన్నారు.



చినమేరంగి ఎంపీపీ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

పక్కాగా వైద్య పరీక్షలు : డీఐవో

గరుగుబిల్లి: ఆరోగ్య పరీక్షలు, పరీక్షల నిర్వహణ పక్కాగా జరగాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) డా. టి.జగన్మోహనరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని చినగుడబలో గురువారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులలో నమోదు చేసిన రోగుల అనారోగ్య సమస్యలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోవున్న గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు పూర్తి స్థాయిలో నిర్వహించి నమోదు చేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం వుందని జ్వర నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో కలిసి హైరిస్క్ గర్భిణుల గృహ సందర్శన చేసి అందుకు గల కారణాలును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో డా.సాగర్‌వర్మ, సూపర్‌వైజర్లు రవణమ్మ, జయగౌడ్ తదితరులున్నారు.



చినగుడబలో రోగుల ఓపీ రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో

రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలి

పాలకొండ రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని ఏపీ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. ఆ సంఘం పిలుపుతో నిర్వహిస్తున్న జీపు జాతా పాలకొండ మండలం లుంబూరు గ్రామంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘం నేతలు మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలు విడనాడక పోతే బీజేపీకి గుణపాఠం తప్పదన్నారు. రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు మధ్య మండల కేంద్రాల్లో నిరసనలు, 17 నుంచి 19 వరకు పార్టీలకతీతంగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కేరళ తరహాలో రైతు ఉపశమన చట్టం అమలు, ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం, 50 సంవత్సరాలు నిండిన రైతులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని నినాదాలు చేశారు.



జీపు జాతా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

వ్యాధులపై అప్రమత్తత అవసరం

సీతంపేట: సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. ఐటీడీఏలో మలేరియా నివారణా సిబ్బందితో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సింథటిక్ పైరాత్రిన్ స్ప్రేయింగ్ పక్కగా జరగాలన్నారు. పాజిటివ్ కేసులు వచ్చిన వెంటనే వారి సమీప కాంట్రాక్ట్స్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయాలన్నారు. ఇదే సమావేశానికి గూగుల్ మీట్‌లో హాజరైన ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, మెడికల్ ఆఫీసర్లతో మాట్లాడుతూ అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: పట్టణంలోని వెంకమ్మపేట రక్షిత పథకానికి సంబంధించి పైపులైన్ మరమ్మతులకు గురైనట్లు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో ఈ రక్షిత పథకం పరిధిలో 1, 2, 10 నుంచి 13, 17 నుంచి 20 వార్డుల పరిధిలో రక్షిత కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. దీన్ని గుర్తించి ప్రజలు సహకరించాలన్నారు. ఈ మేరకు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో తాగునీరు అందిస్తామన్నారు. సకాలంలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు.

• సత్వర పరిష్కారం



జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకుంటున్నాయని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. కురుపాం మండలం కిచ్చాడ గ్రామంలో సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆమె పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్‌చంద్రశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

– కురుపాం

• సులభతరం



జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలు ప్రజలకు సులభతరంగా అందుతున్నాయని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. తోటపల్లి, ఆర్డీవలస గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పలువురు అర్హులకు ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ జీవీ జనార్దన్, ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్‌లు ఎ.సింహాచలమ్మ, ఎం.భాగ్యలక్ష్మి, జె.నరస్వతి, బి.వెంకటనాయుడు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

– గరుగుబిల్లి

• సంక్షేమ రాజ్యం



రాష్ట్రంలో జగనన్న సురక్ష వంటి కార్యక్రమం ద్వారా ప్రజా సంక్షేమ రాజ్యం నడుస్తుందని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రమాదేవి అన్నారు. గ్రామంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, వ్యవసాయ సలహా మండలం అధ్యక్షుడు రణస్థలం రాంబాబు పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్